● శతమానంభవతి



తన పుట్టినరోజును పురస్కరించుకుని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకుంటున్న టీఎస్‌రెడ్కో మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి

# కాంగ్రెస్ మెడకు వాల్మీకి ఉచ్చు

▸ మొదటిపేజీ తరువాయి...

సొమ్ము ప్రభుత్వ అకౌంట్ల నుంచి ఏ కారణం లేకుండా అక్రమంగా దారిమళ్లిందని, ఆ సొమ్ము ఎవరి ఖాతాలోకి బదిలీ అయ్యిందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. రూ.180 కోట్లలో రూ.45 కోట్లు హైదరాబాద్‌లోని 9 బ్యాంకు ఖాతాలకు బదిలీ చేశారని, ఆ ఖాతాలు ఎవరివో వెల్లడించాలని నిలదీశారు. ఈ వ్యవహారం బయటకు రాగానే వాల్మీకి కార్పొరేషన్ అకౌంట్స్ సూపరింటెండెంట్ సూసైడ్ చేసుకోవటం అనుమానాలకు తావిస్తున్నదని చెప్పారు. అలాగే వీ6 పేరుతో ఉన్న బిజినెస్ సంస్థకు రూ.4.5 కోట్లు బదిలీ చేసినట్టు వార్తలు వచ్చాయని, ఆ సంస్థ యజమాని ఎవరో చెప్పాలని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆ డబ్బునే వాడినట్టు అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు.

### మీడియాను మేనేజ్ చేసిందెవరు?

ఈ స్కాం వ్యవహారంలో సిట్, సీఐడీ, ఈడీ హైదరాబాద్‌లో దాడులు నిర్వహించినా.. ఆ సమాచారం మీడియాలో రాకుండా అడ్డుకున్నదెవరు? అని కేటీఆర్ ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సహా కీలక కాంగ్రెస్ నేతలు కొంత



మంది మీడియాను మేనేజ్ చేసినా.. మరో నాలుగైదు రోజుల్లో అన్ని విషయాలు బయటకొస్తాయని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో కొన్ని బార్లు, బంగారు దుకాణాల నుంచి భారీగా నగదు విత్‌డ్రా చేసినట్టు తమకు సమాచారం ఉన్నదని, ఆ బార్లు, బంగారం దుకాణాలను నడుపుతున్నదెవరు? వారికి కాంగ్రెస్ పార్టీతో ఉన్న సంబంధం ఏమిటి? అని నిలదీశారు.

### రాహుల్ మాట్లాడరెందుకు?

కర్ణాటక సీఎం సిద్ధరామయ్యను తొలగిస్తే తెలంగాణ ప్రభుత్వం కూడా కూలిపోతుందని కర్ణాటక మంత్రి సతీశ్ జార్కిహోళీ పేర్కొనటం వెనుక మతలబు ఏమిటి? అని కేటీఆర్ ప్రశ్నించారు. కర్ణాటక కాంగ్రెస్, తెలంగాణ కాంగ్రెస్ నేతల మధ్య పెనవేసుకున్న బంధం వాల్మీకి స్కామేనా అని నిప్పులు చెరిగారు. ఈ స్కామ్‌లో తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఉన్నట్టు ఆధారాలున్నా ఈడీ ఎందుకు మౌనంగా ఉన్నదో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతలను కాపాడుతున్న వ్యక్తులు, శక్తులు ఏవో బయటకు రావాలని అన్నారు. పార్లమెంట్‌లో అవినీతిపై మాట్లాడే రాహుల్ గాంధీ.. వాల్మీకి స్కాంలో ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. సొంత పార్టీ నేతలు అవినీతి చేస్తే మాఫీయేనా? అని విమర్శించారు.

## కృష్ణుడి మార్గంలో నడుద్దాం: గవర్నర్



హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ) : శ్రీకృష్ణ భగవానుడు చూపిన ధర్మమార్గంలో నడుద్దామని గవర్నర్ జిష్ణుదేశ్‌వర్మ పిలుపునిచ్చారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సౌభ్రాతృత్వం, సామరస్యం వర్ధిల్లాలని భగవానుడిని ప్రార్థిస్తున్నట్టు పేర్కొన్నారు.




# వాల్మీకి స్కాంపై విచారణ జరిపించాలి

- దీనిపై రాహుల్‌గాంధీ జవాబు చెప్పాలి
- స్కాంపై బీజేపీ స్పందించటం లేదెందుకు?
- బీఆర్ఎస్ నేత పుట్ట విష్ణువర్ధన్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ): కర్ణాటక వాల్మీకి స్కాంలో తెలంగాణ కాంగ్రెస్ నాయకుల పాత్రపై విచారణ జరిపించాలని బీఆర్ఎస్ నేత పుట్ట విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. వాల్మీకి స్కాంలో తెలంగాణ కాంగ్రెస్ నేతల పాత్ర ఉన్నదని ఆరోపించారు. దేశంలో ఏ నుంచి జెడ్ వరకు కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో స్కాంలు జరిగాయని, కేంద్రంలో కాంగ్రెస్ పాలనలో రూ.5 లక్షల కోట్ల కుంభకోణం జరిగిందని అనేక సంస్థలు చెప్పాయని గుర్తుచేశారు. వాల్మీకి కుంభకోణంలో మొత్తం



రూ.187 కోట్ల కుంభకోణం జరిగిందని, దీనికి బాధ్యుడైన కర్ణాటక మంత్రి నాగేంద్ర ప్రస్తుతం జైల్లో ఉన్నారని తెలిపారు. వాల్మీకి సంస్థ డబ్బులను తెలంగాణ, ఏపీకి తరలించారని, ఇందులో తెలంగాణ కాంగ్రెస్ నాయకుల పాత్రపై రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వాల్మీకి సొసైటీలో జరిగిన రూ.90 కోట్ల అవినీతిలో ఏపీకి రూ.45 కోట్లు, తెలంగాణకు మరో రూ.45 కోట్లు బదిలీ అయ్యాయని తెలిపారు. ఇందులో వీ6 బిజినెస్ సొల్యూషన్స్‌కు రూ.4.50 కోట్లు బదిలీ అయ్యాయని, ఈ కంపెనీ ఎవరిదో కాంగ్రెస్ నేతలు స్పష్టం చేయాలని అన్నారు. సీబీఐ విచారణ చేస్తున్న ఈ స్కామ్‌పై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఈ స్కామ్‌లో తెలంగాణకు చెందిన సత్యనారాయణ వర్మను అరెస్టు చేశారని.. ఆయన రూ.3.50 కోట్లతో స్పోర్ట్స్ కారు సహా 35 కిలోల బంగారం కొనుగోలు చేశారని వివరించారు. ఈ స్కాంలో తెలంగాణ కాంగ్రెస్ నేతల పాత్రపై రేవంత్‌రెడ్డి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## 'రెండు'గా విడిపోయిన రైలు

### కిసాన్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రమాదం

న్యూఢిల్లీ, ఆగస్టు 25: ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు ఫిరోజ్‌పూర్ నుంచి ధన్‌బాద్ వెళుతున్న కిసాన్ ఎక్స్‌ప్రెస్‌లోని 22 బోగీల్లో 13 విడిపోవడం ప్రయాణికులను భయాందోళనకు గురిచేసింది. యూపీలోని చక్రాజ్‌మల్ వద్ద ఈ ఘటన జరిగింది. ఇంజిన్‌తోపాటు 8 బోగీలు సియోహరా స్టేషన్ వైపు పయనించగా.. 13 కోచ్‌లు చక్రాజ్‌మల్ వద్ద ఆగిపోయాయి. పోలీస్ రిక్రూట్‌మెంట్ అభ్యర్థులతో పాటు వందలాది ప్రయాణికులున్న ఈ రైలులో అదృష్టవశాత్తు ఎవరికీ గాయాలు కాలేదు. ప్రమాదాన్ని రైల్లోని గార్డ్ వెంటనే గుర్తించి రైల్ డ్రైవర్, పోలీసులకు సమాచారం అందించడంతో వారు వెంటనే స్పందించి బస్సుల్లో పోలీస్ రిక్రూట్‌మెంట్ అభ్యర్థులను బరేలీకి పంపారు. సాంకేతిక తప్పిదం వల్ల ఈ ప్రమాదం జరిగిందని రైల్వే అధికారులు తెలిపారు. ఈ ఘటన కారణంగా కొన్ని గంటలపాటు ఆ మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది.




## కేటీఆర్ రాఖీయిజమా? రేవంత్ రౌడీయిజమా?

- మనం ఎటువైపు ఉందాం?
- తెలంగాణ సమాజానికి దాసోజు శ్రవణ్ పిలుపు



హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ): కేటీఆర్ రాఖీయిజమా? సీఎం రేవంత్‌రెడ్డి రౌడీయిజమా? ఎటువైపు ఉందాం? అని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ తెలంగాణ సమాజాన్ని ప్రశ్నించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణలో ప్రోత్సహిస్తున్న రాఖీ సంస్కృతిని కోరుకుందామా? సీఎం రేవంత్‌రెడ్డి ప్రోత్సహిస్తున్న ప్రమాదకర రౌడీ సంస్కృతిని కోరుకుందామా? తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మహిళా జర్నలిస్టులు అనే కనీస విచక్షణ లేకుండా, అసభ్యకరంగా ప్రవర్తించినా, అసెంబ్లీలో మహిళా శాసనసభ్యులని అగౌరవపర్చినా బారాఖూన్ మాఫ్ అనేలా వాతావరణం మారిపోవటం విషాదకరమని అన్నారు. ఆడబిడ్డలు తమ సోదర సమానుడైన నాయకుడికి రాఖీకడితే నేరమైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ తల్లిని గౌరవించకుండా ప్రవర్తించడం.. ఆఖరుకు రాఖీ సంస్కృతిని అవమానించేలా సీఎం రేవంత్‌రెడ్డి వక్రబుద్ధిని ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని, సామాజిక అస్థిత్వాన్ని దెబ్బతీయమే సీఎం రేవంత్‌రెడ్డి పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి కుట్రపూరిత వ్యూహాలను తిప్పికొట్టి తెలంగాణ అస్థిత్వాన్ని నిలబెట్టేందుకు మరోసారి ఐక్యపోరాటాలకు సిద్ధం కావాల్సిన వాతావరణం నెలకొన్నదని పేర్కొన్నారు.

# గురుకులాల్లో గందరగోళం!

- ఇష్టారాజ్యంగా ఉన్నతాధికారుల నిర్ణయాలు
- నిబంధనలకు తిలోదకాలు.. అందని పుస్తకాలు
- రెండు నెలలుగా ఉద్యోగులకు అందని వేతనాలు
- అయోమయంగా బదిలీలు, పదోన్నతులు
- సర్కారు నిర్ణయం కోసం ఎదురుచూపులు



హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ): గురుకులాల్లో గందరగోళం నెలకొన్నది. ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉద్యోగులు, సిబ్బంది రెండు నెలలుగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఎస్సీ వెల్ఫేర్ సొసైటీలో పాలన గాడితప్పింది. బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ ఒక ప్రహసనంగా కొనసాగుతున్నది. సత్వరమే స్పందించి సమస్యలన్నింటికీ ముగింపు పలకాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతున్నారు. ప్రభుత్వం దృష్టిపెట్టకపోతే సొసైటీల్లోని యూనియన్లు పోరుబాటకు సిద్ధమవుతున్నాయి. సాంఘిక సంక్షేమ గురుకులాల్లో వేలాది మంది ఉపాధ్యాయులు రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతుండగా, బోధన అస్తవ్యస్తంగా మారింది. విద్యార్థుల బాగోగులను పట్టించుకునే వారే కరువయ్యారు. పలుచోట్ల కిందిస్థాయి సిబ్బంది అక్కడ పెత్తనం చెలాయిస్తున్నారు.

### సంక్షేమ శాఖలకు మంత్రులే కరువు


రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరి 9 నెలలు కావస్తున్నది. ఇప్పటికీ సాంఘిక సంక్షేమ, మైనార్టీ, గిరిజన సంక్షేమ శాఖలకు మంత్రులను నియమించలేదు. ఆయా శాఖలన్నీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దే ఉన్నాయి. దీంతో ఆయా శాఖల పరిధిలోని గురుకులాల పరిస్థితి దయనీయంగా మారింది. సీఎం అజమాయిషీలో ఉన్నా కూడా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక, విధానపర నిర్ణయాల జాప్యంతో క్షేత్రస్థాయిలో అనేక ఇబ్బందులు నెలకొంటున్నాయి. ప్రధాన కార్యాలయాల్లోని కొందరు అధికారులు ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నారు.కార్యాలయాల్లో కొందరు ఓడీలపై తిష్ఠవేసి జులుం ప్రదర్శిస్తున్నారు. ఇష్టారీతిన నిర్ణయాలు తీసుకుంటూ ఇటు విద్యార్థులను, అటు ఉపాధ్యాయులకు చుక్కలు చూపుతున్నారు. సోషల్ వెల్ఫేర్‌లో రాత్రికి రాత్రే సర్క్యులర్లు, మరుసటి రోజే ఆర్డర్లతో అన్ని అనాలోచిత నిర్ణయాలే తీసుకుంటూ అరిగోస పెడుతున్నారని సొసైటీ ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను చెప్పుకున్నా పరిష్కరించకుండా, ఆపై బెదిరింపులకు దిగుతున్నారని, వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని కక్షసాధింపులకు దిగుతున్నారని కొందరు మహిళా ఉపాధ్యాయులు కన్నీటిపర్యంతమవుతున్నారు.

### అటకెక్కిన అనేక సమస్యలు

గురుకుల అధికార యంత్రాంగమంతా బదిలీలు, ప్రమోషన్లకే పరిమితం కావడంతో అనేక అంశాలు అటకెక్కాయి. విద్యార్థులకు కాస్మొటిక్ చార్జీలు ఈ ఏడాది మార్చి వరకే అందాయి. డైట్ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో సరైన పౌష్టికాహారం అందని పరిస్థితి నెలకొన్నది. నాణ్యత లేని సరుకులను సరఫరా చేస్తుండటంతో విద్యార్థులు అనారోగ్యాల పాలవుతున్నారు. అస్వస్థతకు గురవుతున్నారు. అనేక భవనాల అద్దెలు, విద్యుత్తు చార్జీలు బిల్లులు నిలిచిపోయాయి. సీవోఈలు, పార్ట్ టైమ్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, సీనియర్ ఫ్యాకల్టీ సబ్జెక్ట్ అసోసియేట్లకు రెండు నెలలుగా జీతాల చెల్లింపు నిలిచిపోయింది.దీంతో వారంతా అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

### పోరుబాటకు యూనియన్లు సిద్ధం

ఉన్నతాధికారుల అనాలోచిత నిర్ణయాలు, మరోవైపు ప్రభుత్వ నిర్లక్ష్యంపై సొసైటీల్లోని అన్ని యూనియన్లు ఆగ్రహంతో ఉన్నాయి. బదిలీలు, ప్రమోషన్లలో అనేక అవకతవకలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే బాధిత ఉపాధ్యాయులతో కలిసి అనేకమార్లు నేరుగా ప్రజాభవన్‌కు వెళ్లి వినతులు సమర్పించారు. సీఎస్, సీఎంవో కార్యాలయ అధికారులకు మొరపెట్టుకున్నారు. ఇప్పటికీ ఆశించిన ఫలితం రాకపోవడంతో యూనియన్లు మండిపడుతున్నాయి. కలిసికట్టుగా పోరుబాట పట్టేందుకు సిద్ధమవుతున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి సోషల్ వెల్ఫేర్ గురుకులంలో బదిలీలు, ప్రమోషన్లను పూర్తిగా పునఃసమీక్షించేందుకు ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఆయా అంశాలపై ప్రభుత్వం నుంచి మరో రెండు రోజుల్లో స్పష్టమైన నిర్ణయాలు వెలువడకుంటే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరిస్తున్నాయి. మూకుమ్మడిగా విధులను బహిష్కరించి, సెక్రటేరియట్ ముట్టడికి తరలివెళ్లి తాడోపేడో తేల్చుకోవాలని యూనియన్లు ప్రణాళికలను రూపొందిస్తున్నాయి.




## తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్‌గా లచ్చిరెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటుచేశారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో 65 సంఘాలు.. డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీ లచ్చిరెడ్డిని చైర్మన్‌గా ఏకగ్రీవం గా ఎన్నుకున్నాయి.ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగుల ఆరోగ్యం, పదోన్నతుల క్యాలెండర్, హౌసింగ్ పాలసీకి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు అశ్వత్థామరెడ్డి, నిర్మల, లక్ష్మిరెడ్డి, సంపత్‌కుమార్, హర్షవర్ధన్‌రెడ్డి, కుమారస్వామి, మహిపాల్‌రెడ్డి, షౌకత్‌అలీ, శ్రీకాంత్, ఉపేందర్‌రావు, గోపాల్‌రెడ్డి, రామకృష్ణ, రాములు, రమేశ్, పూల్‌సింగ్‌చౌహాన్, హరికిషన్, తిరుపతినాయక్, జనార్దన్, మేడి రమేశ్, దేవికా రొక్కం, మమత, వాణి, సక్కుబాయి, కమలాకర్ పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి

సికింద్రాబాద్, ఆగస్టు 25: తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులందరికీ 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, తెలంగాణ విద్యార్థి జేఏసీ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ న్యూ సెమినార్ హాల్లో నిర్వహించిన మలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో శ్రీహరి, లోకేశ్ , చరణ్‌కౌశిక్, శ్రీధర్, దరువు ఎల్లయ్య, వరంగల్ రవి, కోట శ్రీనివాస్, దుర్గం భాస్కర్, మందాల భాస్కర్, కృష్ణకాంత్, సురేష్, రెడ్డి శ్రీనివాస్, రవి, వంశీ, సురేష్, కృష్ణ పాల్గొన్నారు.

## నీట్-యూజీ కౌన్సెలింగ్

- టాప్-17 మందికి ఢిల్లీ-ఎయిమ్స్‌లో సీటు
- మొదటి రౌండ్ ఫలితాల ప్రకటన

న్యూఢిల్లీ, ఆగస్టు 25: మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ(ఎంసీసీ) నీట్ యూజీ-2024 మొదటి కౌన్సెలింగ్ రౌండ్ తుది సీట్ల కేటాయింపు ఫలితాలను ప్రకటించింది. నీట్-యూజీని విజయవంతంగా పూర్తిచేసిన 26,109 మంది అభ్యర్థులకు వారి అర్హత ఆధారంగా ఈ రౌండ్‌లో ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లు కేటాయించారు. ఫలితాలను ఎంసీసీ వెబ్‌సైట్‌లో ఉంచారు. టాప్-17 ర్యాంకర్లు ఢిల్లీ-ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ సీట్లు పొందారు. రెండో రౌండ్ కోసం పీడబ్ల్యూడీ సర్టిఫికెట్ అవసరమైనవారు అధికారిక వికలాంగ కేంద్రాల్లో సెప్టెంబర్ 9వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు వాటిని పొందవచ్చు. ఈ నెల 29లోగా తమకు కేటాయించిన కళాశాలల్లో విద్యార్థులు రిపోర్ట్ చేయాలి. ఒకే విద్యాసంస్థలో క్యాటగిరీ లేదా కోటా మారినవారు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో జనరేట్ చేసిన రిలీవింగ్ లెటర్ తీసుకొని సవరించిన కోటా లేదా క్యాటరిగీలో చేరాలి. కొత్త క్యాటగిరీ లేదా కోటాలో చేరేవారికి తాజాగా ఆన్‌లైన్‌లో జనరేట్ చేసిన అడ్మిషన్ లెటర్ అవసరం. ఇది సమర్పించకపోతే కేటాయించిన సీట్ రద్దవుతుంది.